## కడలి కోత, కాలుష్య నివారణకు
# రూ.1675 కోట్లు

**ప్రభుత్వ ఉత్తర్వుల జారీ**

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సముద్రతీర ప్రాంతాల్లో కడలి కోత, కాలుష్య నిరోధక పనులు, జీవాల పరిరక్షణ తదితర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ప్రపంచ బ్యాంక్ సాయంతో ఈ పనులు నిర్వహించడానికి రూ.1675 కోట్ల మేరకు నిధులు విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జరిగిన శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతాల్లో కాలుష్య నివారణకు భారీ ఎత్తున నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. సముద్రతీర ప్రాంతాలను కాలుష్య రహిత పర్యాటక ప్రదేశాలుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సముద్ర తీరాలకు చేరువగా ఉన్న జనావాస ప్రాంతాల్లో సముద్రపు జలాలు చొరబడకుండా ఉండేందుకు, రహదారులు కడలి కోతకు గురికాకుండా ఉండేందుకు, కడలిలోని తాబేళ్లు, డాల్ఫిన్లు తదితర జంతు జీవాలకు ఎలాంటి హాని కలగకుండా కాపాడేందుకు పంచ వర్ష ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఆ ప్రణాళికను అమలు చేసే దిశగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం రూ.1675కోట్ల మేరకు నిధులు విడుదల చేసింది. ఈ ప్రణాళిక అమలుకు ప్రపంచ బ్యాంక్ ఆర్థికసాయం కూడా కోరనున్నట్లు గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు.



కొళత్తూరులో జరిగిన 'సమత్తువ పొంగల్' వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులు

# భద్ర నగరం చెన్నై

● పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్

ప్యారీస్, జనవరి 11: అన్ని వర్గాలు, మతాలు, భాషల ప్రజలకు రక్షణ కల్పించే నగరంగా చెన్నై ఉందని పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్ పేర్కొన్నారు. స్థానిక ఫ్లవర్ బజార్ ఐజక్ వీధిలో మహిళా కానిస్టేబుళ్ల కోసం నిర్మించిన వసతి గృహాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అడిషినల్ కమిషనర్ ఆస్రా గార్గ్, ఉన్నత పోలీసు అధికారులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సందీప్‌రాయ్ మీడియాతో మాట్లాడుతూ... 57 మంది మహిళా కానిస్టేబుళ్లకు బస వసతి కల్పిస్తూ 21 గదులతో నిర్మితమైన ఈ భవనం స్థానిక పోలీసులు, ఇతర జిల్లాల నుంచి వచ్చే మహిళా పోలీసులు వినియోగించుకోవచ్చన్నారు. కేసులకు సంబంధించి కోర్టులకు వచ్చే పోలీసులు రోజుకు అద్దెగా రూ.100 చెల్లించి బస చేయవచ్చన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌లో పాల్గొనే మహిళా కానిస్టేబుళ్లకు తుపాకులు పంపిణీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇక, దేశంలోని ప్రధాన నగరాల్లో భద్రతపై ఇటీవల నిర్వహించిన సర్వేలో చెన్నై నగరం ఆ జాబితాలో ఉందన్నారు. మత్తుబిళ్లలు, మత్తు ఇంజెక్షన్ల విక్రయాలు అడ్డుకొనేందుకు ఆరోగ్యశాఖతో కలసి పోలీసు శాఖ పలు అవగాహన ప్రచార కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ చర్యలకు పాల్పడే సంఘ విద్రోహులపై కఠినచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పొంగల్ పండుగ సందర్భంగా చెన్నైలో భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. ముఖ్యంగా కానుం పొంగల్ రోజున మెరీనా బీచ్, ఎలియట్స్ బీచ్, కాశిమేడు తదితర ప్రాంతాల్లో ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో మూడేళ్లుగా ఒకే ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసుల బదిలీ పనులు జరుగుతున్నాయన్నారు. 31వ తేది బదిలీలకు సంబంధించి తొలి జాబితా విడుదల చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ తెలిపారు.



మహిళా పోలీసుల విశ్రాంతి గృహాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్

# బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం

● ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ గౌడ్

ప్యారీస్, జనవరి 11: దేశంలో గత పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జాతీయ కార్యదర్శి, తెలంగాణ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ వ్యాఖ్యానించారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఏఐసీసీ సమాచార విభాగం నిర్వాహకురాలు భవ్యా నరసింహమూర్తితో కలసి మధుయాష్కీ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ చేపట్టిన 'దేశ సమైక్యత పాదయాత్ర'పై తమిళంలో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను నమ్మించి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ గత పదేళ్లలో ప్రజల సంక్షేమాన్ని, దేశాభివృద్ధిని విస్మరించి అదానీ వంటి సిరిమంతుల అభివృద్ధికి అండగా నిలిచారని విమర్శించారు. నిత్యావసర సరుకులు, ఇంధనం ధరలు విపరీతంగా పెంచారని, పెట్రోల్, డీజిల్ ధరలను సంవత్సర కాలంగా తగ్గించిన దాఖలాలు లేవన్నారు. మునుపెన్నడూ లేని స్థాయిలో విద్యావంతుల ఉద్యోగావకాశాల కలలు నెరవేరలేదని, రోజురోజుకు నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలకు న్యాయపరంగా కల్పించాల్సిన రిజర్వేషన్లు సైతం న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కారణం చూపి, కేంద్రం ఆ వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఐటీ, ఈడీ విభాగాలను ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను అడ్డుకొనే విధంగా కేంద్రం వినియోగించుకోవడం పరిపాటి అయిందన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యలపై పార్లమెంటు ఉభయసభల్లో గళం విప్పే ప్రతిపక్షాల ఎంపీలను డిస్మిస్ చేసేలా చట్టాలు రూపొందించడం దారుణమన్నారు.కార్యక్రమంలో టీఎన్‌సీసీ ఎస్సీ విభాగ అధ్యక్షుడు నిరంజన్ కుమార్, నాయకులు గోపన్న, ఎస్‌ఏ వాసు, నిలవన్, పౌన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ చేపట్టిన దేశ సమైక్యత పాదయాత్ర తమిళ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మధుయాష్కీ తదితరులు





# ఓపీఎస్‌కు హైకోర్టు షాక్

● అన్నాడీఎంకే పతాకం వినియోగంపై స్టే సబబేనని స్పష్టీకరణ

పెరంబూర్, జనవరి 11: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే బహిష్కృత నేత ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్)కు హైకోర్టు షాకిచ్చింది. అన్నాడీఎంకే పతాకం, చిహ్నం, లెటర్ పాడ్ తదితరాలను ఓపీఎస్ వినియోగంపై విధించిన స్టే చెల్లుబాటవుతుందని స్పష్టం చేసింది. 2022 జూలై 11వ తేది జరిగిన అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశంలో ఓపీఎస్ సహా నలుగురిని పార్టీ నుంచి తొలగించగా, పళనిస్వామిని తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాలను వ్యతిరేకిస్తూ ఓపీఎస్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారించిన హైకోర్టు, పళనిస్వామి సహా నలుగురి తొలగింపుపై స్టే విధించేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో, అన్నాడీఎంకే జెండా, చిహ్నం, లెటర్ పాడ్ ఓపీఎస్ వర్గీయులు వినియోగించడంపై స్టే విధించాలని కోరుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని విచారించిన హైకోర్టు సింగిల్ జడ్జి.. ఓపీఎస్ అన్నాడీఎంకే పతాకం వినియోగించడంపై స్టే విధించారు. ఓపీఎస్ దీనిని సవాల్ చేస్తూ.. ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.మహాదేవన్, జస్టిస్ మహమ్మద్ షఫీక్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. అన్నాడీఎంకే పతాకం, చిహ్నం, లెటర్ పాడ్ తదితరాలను ఒ.పన్నీర్‌సెల్వం వినియోగించరాదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఓపీఎస్ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు ప్రకటించింది. అయితే ఓపీఎస్ అవసరమైతే మళ్లీ సింగిల్ జడ్జిని ఆశ్రయించుకునేందుకు వెసులుబాటు కల్పించింది.

**నమ్మకద్రోహానికి సరైన శిక్ష: అన్నాడీఎంకే**

అన్నాడీఎంకేకు నమ్మకద్రోహం చేసిన ఓపీఎస్‌కు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం సరైన శిక్ష విధించిందని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుపై జయకుమార్ స్పందిస్తూ.. అన్నాడీఎంకే కార్యాలయంపై గూండాలతో వచ్చి దాడి చేసిన ఓపీఎస్... ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఇకనైనా తమ పార్టీ పతాకాలు వినియోగించరాదని చెప్పారు.

# రేపు అమిత్ షాతో రాష్ట్ర ఎంపీల భేటీ

**తుఫాను బాధిత ప్రాంతాలకు భారీ నిధుల కోసం పట్టు**

పెరంబూర్, జనవరి 11: వరుస వర్షాలు, తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని, సహాయక చర్యల కోసం భారీగా నిధులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ఎంపీలు శనివారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నారు. ఈ మేరకు అమిత్‌షా అపాయింట్‌మెంట్ లభించడంతో ఎంపీలు ఢిల్లీ బయలుదేరివెళ్తున్నారు. మిచౌంగ్ తుఫాను కారణంగా చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలు, భారీవర్షాల కారణంగా తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. తుఫాను బాధిత జిల్లాల్లో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారీవర్షాల బాధిత జిల్లాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా కేంద్ర అధికారుల బృందం పర్యటించి, వరద నష్టాన్ని అంచనా వేసింది. వరద బాధిత ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన నిర్మలా సీతారామన్ వద్ద రాష్ట్రప్రభుత్వం తరఫున మంత్రి తంగం తెన్నరసు వరద బాధితులను ఆదుకోవడం, బాధిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన మరమ్మతులకు సుమారు రూ.21,000 కోట్లు అందించాలని లేఖ రూపంలో విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రులు, అధికారులు పర్యటించినా ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎలాంటి నిధులు అందలేదు. దీంతో, రాష్ట్రానికి చెందిన అఖిలపక్ష ఎంపీలతో బృందం కలిసేందుకు కేంద్రమంత్రి అమిత్ షా సమయం కేటాయించాలని సీఎం స్టాలిన్ లేఖ రాశారు. అదే సమయంలో రాష్ట్రానికి వరద సహాయ నిధులు అందజేసి కేంద్రం ఆదుకోవాలని కోరుతూ సీపీఎం, సీపీఐలు ఆందోళనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో, శనివారం రాష్ట్ర ఎంపీలకు అమిత్‌షా సమయం కేటాయించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి వరద నివారణ నిధులు రూ.37,907.19 కోట్లు అందించాలని రాష్ట్ర ఎంపీల బృందం కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.




# కలిసి పోటీచేద్దాం!

● పీఎంకే, డీఎండీకే, ఏఎంఎంకే, ఓపీఎస్ వర్గానికి బీజేపీ పిలుపు


● తృతీయ కూటమికి సన్నాహాలు!

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకూ కలిసిసాగిన అన్నాడీఎంకే దూరంగా జరగడంతో రాష్ట్రంలో కొత్త కూటమి కోసం బీజేపీ తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టింది. అటు డీఎంకే, ఇటు అన్నాడీఎంకే కూటమికి దూరంగా ఉంటున్న పార్టీలను దరి చేర్చుకుని, జట్టుకట్టాలని నడుం బిగించింది. ఇందులో భాగంగా పీఎంకే, డీఎండీకే, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే), అన్నాడీఎంకే బహిష్కృత నేత ఓపీఎస్ వర్గాలతో చర్చలు సాగిస్తోంది. ఆ పార్టీ అనుకున్నది అనుకున్నట్లు జరిగితే త్వరలో రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో కొత్త కూటమి ఏర్పాటు కావడం ఖాయంగా కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు మరో నాలుగు నెలల్లో జరగనున్న తరుణంలో రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ ముమ్మర సన్నాహాల్లోకి దిగాయి. రాష్ట్రంలో అధికార పార్టీ డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఉండే పార్టీలు ఇప్పటికే దాదాపు ఖరారయ్యాయి. ఇక అన్నాడీఎంకే సైతం.. తనతో కలిసొచ్చే పార్టీల కోసం అన్వేషణ సాగిస్తోంది. కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ... రాష్ట్రంలోనూ ఓటు బ్యాంకు పెంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ సారి ఎన్నికల్లో కనీసం నాలుగైదు స్థానాల్లో గట్టి పోటీ ఇవ్వాలని తలపోస్తోంది. ఇందుకోసం తమతో కలిసొచ్చే పార్టీలతో మంతనాలు సాగిస్తోంది. గత ఎన్నికల్లో పీఎంకే... అన్నాడీఎంకే కూటమిలో పోటీ చేసింది. కానీ పెద్దగా సత్ఫలితాలు రాకపోవడంతో ఎన్నికల అనంతరం ఆ కూటమికి దూరంగా జరిగింది. ఆ తరువాత అధికార డీఎంకేకు దగ్గరైనట్లు కనిపించినప్పటికీ ఆ కూటమి ఇప్పటికే కిటకిటలాడుతుండడంతో అందులో తమకు తగిన ప్రాధాన్యం ఉండక పోవచ్చని పీఎంకే నేతలు భావిస్తున్నారు. అందుకే డీఎంకే కూటమితో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో వ్యవస్థాపకుడు విజయకాంత్‌ను కోల్పోయిన డీఎండీకే సైతం గత ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమితో కలిసి పోటీ చేసింది. కానీ ఇప్పుడు ఆ పార్టీ ఆ కూటమికి దూరంగానే ఉంది. ఇక అన్నాడీంకే బహిష్కృత నేత టీటీవీ దినకరన్ నేతృత్వంలోని ఏఎంఎంకే సైతం ఏ కూటమిలోనూ లేకుండా ఒంటరిగా సాగుతోంది. అదే సమయంలో మరో బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం సైతం ఒంటరిగానే వున్నారు. ఇటీవల తిరుచ్చి వచ్చిన ప్రధాని మోదీతో సమావేశమైన ఆయన.. బీజేపీతో కలిసి సాగేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. అందువల్ల ఈ నలుగురితో పాటు మరికొన్ని చిన్నాచితకా పార్టీలను కలుపుకుని సాగితే కొంతమేరకైన సత్ఫలితాలు రాబట్టవచ్చని కమలనాథులు భావిస్తున్నారు.ఆ దిశగా వారు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

# పెరుగుతున్న డెంగ్యూ జ్వరాలు

**2 వారాలపాటు వేడి నీళ్లే తాగండి ● ఆరోగ్యశాఖ సూచన**

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డెంగ్యూ జ్వరాలు అధికమవుతుండటంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రజలు మరో రెండు వారాలపాటు అప్రమత్తంగా వ్యవహరించి వేడినీళ్లనే తాగాలని సూచించింది. ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రంలో డెంగ్యూ జ్వరాల ప్రబలాయని, గతేడాది డిసెంబర్ వరకూ 9,121 కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ జ్వరాలకు రాష్ట్రవ్యాప్తంగా పదిమంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ యేడాది ఈ నెల 8 వరకు రాష్ట్రంలో 461 మంది డెంగ్యూ జ్వరంతో అస్వస్థతకు గురయ్యారని, మరో రెండువారాలపాటు ఈ జ్వరాలు ప్రబలే అవకాశాల ఉన్నాయని వివరించారు. ఈశాన్య రుతుపవనాలు ఇంకా నిష్క్రమించలేదని, ప్రస్తుతం చలిగాలులు అధికమై చల్లటి వాతావరణం నెలకొనడంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయని చెప్పారు. ప్రతిరోజూ పదిమంది దాకా ఈ జ్వరాలతో చికిత్స కోసం ఆసుపత్రులకు వస్తున్నారని వివరించారు. ఈ జ్వరాలతోపాటు విరేచనాలు, వైరల్, టైఫాయిడ్ జ్వరాలు కూడా అధికమవుతున్నాయని హెచ్చరించారు. చిన్నారులు కూడా ఈ జ్వరాల బారినపడుతున్నారని, వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్సలందించాలన్నారు. న్యుమోనియా కూడా అక్కడక్కడా అధికమవుతున్నట్లు సమాచారం అందుతోందన్నారు. బాగా కాచిన వేడినీటిని చల్లార్చి తాగాలని సూచించారు. ఉడకని ఆహార పదార్థాల జోలికి వెళ్ళకూడదని, రోడ్ సైడ్, ఫుట్‌పాత్ టిఫిన్ సెంటర్లలో తినుబండారాలు, ఆహార పదార్థాలను తినకూడదని, కాళ్లుచేతులను తరచూ కడిగి శుభ్రం చేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు.






ట్రేడ్‌సెంటర్‌లో ప్రవాసతమిళుల ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

## ప్రవాస తమిళుల కోసం
# మరిన్ని పథకాలు

● మంత్రి ఉదయనిధి హామీ

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశవిదేశాల్లో ఉన్న తమిళుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయనున్నదని యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి హామీ ఇచ్చారు. నందంబాక్కం ట్రేడ్‌సెంటర్‌లో గురువారం ఉదయం 'తమిళ్ వెల్లమ్' పేరుతో ప్రవాస తమిళుల ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ వేడుకలలో శ్రీలంక, మలేసియా, సింగపూర్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, అమెరికా సహా 58 దేశాలకు చెందిన తమిళ వంశీయులు, తమిళ విద్యావేత్తలు, కవులు పాల్గొన్నారు. విదేశాలకు చెందిన 219 అంతర్జాతీయ తమిళ సంఘాలు, 48 రాష్ట్రేతర తమిళ సంఘాలు ప్రతినిధులు కూడా హాజరయ్యారు. తమిళుల ప్రతిభాపాటవాలను తెలిపేలా 40కి పైగా స్టాళ్లు కూడా ఏర్పాటు చేశారు. విదేశీ తమిళ రచయితల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఉదయనిధి మాట్లాడుతూ... రాష్ట్ర విదేశీ తమిళుల పునరావాస మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తమిళ్ వెల్లమ్ వేడుకలను ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. శుక్రవారం ఈ వేడుకల ముగింపు సభలో సీఎం స్టాలిన్ పాల్గొని విదేశీ తమిళుల కోసం కొన్ని పథకాలను ప్రకటించే అవకాశం కూడా ఉందన్నారు. గతంలో విదేశాలకు వెళ్ళిన తమిళులు మోసపోతుండటం ఆనవాయితీగా ఉండేదని డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే తమిళులను అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు రాకుండా విదేశాల్లో ఉన్న తమిళ సంఘాలు, వాటి ప్రతినిధులతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపి ఉద్యోగాలకు వెళ్లేవారిని అన్ని విధాలా ఆదుకుంటోందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధిస్తే దేశ ప్రజలకే కాకుండా, విదేశాల్లో ఉన్న భారతీయులు, ప్రత్యేకించి తమిళులు కూడా బాగుపడతారని ఉదయనిధి అన్నారు. ఈ వేడుకలలో మంత్రి సెంజి మస్తాన్, ఎంపీలు కళానిధి వీరాసామి, తిరుచ్చి శివ, శాసనసభ్యులు అబ్దుల్లా, ప్రభాకర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

## సమాచార దర్శిని

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జనవరి 11: స్థానిక టి.నగర్, వ్యాసర్పాడిలలో శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరగనుంది. వళ్లువర్‌కోట్టం ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో టి.నగర్ పరిధికి చెందిన వారు, వ్యాసర్పాడి ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణంలో అదే ప్రాంతానికి చెందిన వారు పాల్గొని, విద్యుత్ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

### టీఆర్‌బీ పరీక్ష ఆప్షనల్ తేదీల విడుదల

ఐసిఎఫ్, జనవరి 11: ఉపాధ్యాయులు, అధ్యాపకులు అని 6,281 పోస్టుల భర్తీకి నిర్వహించనున్న ఆప్షనల్ రాత పరీక్షల టైంటేబుల్‌ను టీఆర్‌బీ విడుదల చేసింది. పాఠశాల, ఉన్నత విద్య, న్యాయశాఖ ఆధ్వర్యంలో పనిచేసే విద్యాసంస్థల్లో టీచర్లు, లెక్చరర్ల పోస్టుల భర్తీకి టీఆర్‌బీ పరీక్ష నిర్వహిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించిన టైంటేబుల్‌ను టీఆర్‌బీ కార్యదర్శి రాజేశ్వర మురుగన్ బుధవారం విడుదల చేశారు. కొన్ని పరీక్షలు రద్దు కావచ్చు, కొన్ని పరీక్షలు వాయిదా పడొచ్చని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు టీఆర్‌బీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

### తాంబరం - కోయంబత్తూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం - కోయంబత్తూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.● నెం.06086 కోయంబత్తూర్ - తాంబరం ప్రత్యేక సంక్రాంతి సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఈనెల 16, 17 తేదీల్లో కోయంబత్తూర్‌లో రాత్రి 8.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5.20 గంటలకు తాంబరం చేరుకుంటుంది. అలాగే, నెం.06085 తాంబరం - కోయంబత్తూర్ ప్రత్యేక సంక్రాంతి సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఈ నెల 17, 18 తేదీల్లో తాంబరం నుంచి ఉదయం 7.30 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.30 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్లు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.

### 29 నుంచి చెన్నై - బిట్రగుంట రైళ్ల రద్దు

పెరంబూర్, జనవరి 11: విజయవాడ డివిజన్‌లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా బిట్రగుంట- చెన్నై సెంట్రల్ - బిట్రగుంట రైళ్లు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు (కొన్ని రోజులు మినహా) రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రకారం, ఈ నెల 29, 30, 31, ఫిబ్రవరి 2, 5, 6, 7, 8, 9, 12, 13, 14, 15, 16, 19, 20, 21, 22, 23 తేదీల్లో ఇరువైపులా రైళ్లు పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

### ఉచిత ఆధ్యాత్మిక యాత్రకు పేరు నమోదు ప్రారంభం

పెరంబూర్, జనవరి 11: రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన ఆలయాలను భక్తులు ఉచితంగా సందర్శించే వసతి రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ పరిచయం చేసింది. ఈ మేరకు తిరుప్పరకుండ్రం, తిరుచెందూర్, పళని, స్వామిమలై, తిరుత్తణి, పళముదిర్‌చోలై తదితర ఆలయాలకు ఐదు విడతలుగా తలా 200మంది భక్తులు అని మొత్తం 1,000 మందిని ఉచితంగా తీసుకెళ్లనున్నారు. తొలివిడత యాత్ర ఈనెల 28వతేదీ ప్రారంభం కానుంది. ఈ యాత్రకు 60నుంచి 70ఏళ్ల పైబడిన వారు ఈనెల 11నుంచి హిందూ దేవాదాయ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు.

### 16న రేషన్ దుకాణాలకు సెలవు

పెరంబూర్, జనవరి 11: రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలకు ఈనెల 16వ తేదీ సెలవు ప్రకటించారు. రేషన్ దుకాణాలకు ప్రతి శుక్రవారం సెలవురోజు కాగా, ప్రస్తుతం రూ.1,000 నగదుతో కూడిన పొంగల్ బహుమతి పంపిణీ జరుగుతోంది. దీంతో, ప్రజల సౌకర్యార్థం ఈ నెల 12న రేషన్ దుకాణాలను పనిదినంగా ప్రకటించిన ఆహార శాఖ, 16వ తేదీ దుకాణాలకు సెలవు ప్రకటించింది.

### గ్రూప్-2 ప్రిలిమినరీ ఫలితాల విడుదల

పెరంబూర్, జనవరి 11: ప్రభుత్వ శాఖల్లోని 6,151 గ్రూప్-2, గ్రూప్-2ఏ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ 2021 ఫిబ్రవరిలో విడుదల కాగా, 2022 ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షా ఫలితాలు ఈనెల 12న విడుదల కానున్నాయనే ప్రకటన నేపథ్యంలో, ఒకరోజు ముందుగా 11 వ తేదీని విడుద చేశారు. https://www.tnpsc.gov.in/english/latestresults.aspxలో ఫలితాలు తెలుసుకోవచ్చని టీఎన్‌పీఎస్సీ పేర్కొంది.

### ఇక, బీఎడ్ కోర్సు నాలుగేళ్లు

పెరంబూర్, జనవరి 11: వచ్చే విద్యా సంవత్సరం (2024-25) నుంచి విద్యాసంస్థలు రెండేళ్ల బీఎడ్ కోర్సు ప్రవేశాలు చేపట్టరాదని, నాలుగేళ్ల కోర్సు పరిచయం చేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు ఆన్‌లైన్ ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం యూజీ కోర్సులు మూడేళ్లు, బీఎడ్ కోర్సు 2 ఏళ్ల నుంచి 5 ఏళ్లుగా పెంచారు. ఈ నేపథ్యంలో, నూతన జాతీయ విద్యా విధానంలో నాలుగేళ్ల యూజీ కోర్సు, బీఎడ్ కోర్సుతో కూడిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (ఐడీఈపీ) కోర్సును కేంద్ర విద్యాశాఖ పరిచయం చేసింది. ఈ కోర్సులో చేరేందుకు జాతీయస్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ప్రస్తుతం కొన్ని విద్యా సంస్థలు వచ్చే ఏడాది (2024-25) విద్యా సంవత్సరంలో రెండేళ్ల బీఎడ్ కోర్సుకు అడ్మిషన్లు చేపడుతున్నట్లు విద్యాశాఖకు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన విద్యాశాఖ, వచ్చే విద్యా సంవత్సరం రెండేళ్ల బీఎడ్ కోర్సులకు అనుమతి లేదని, కొత్తగా ప్రవేశపెట్టనున్న నాలుగేళ్ల బీఎడ్ కోర్సుకు అనుమతులు కోరుతూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

### మద్యం దుకాణాలకు మూడు రోజులు సెలవు

ఐసిఎఫ్, జనవరి 11: రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలకు మూడు రోజులు టాస్మాక్ సంస్థ సెలవు ప్రకటించింది. 16వ తేదీ తిరువళ్లువర్ డే, 25న వళ్లలార్ స్మారక దినం, 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మూడు రోజులు దుకాణాలు, బార్లు మూసి వేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టాస్మాక్ సంస్థ హెచ్చరించింది.

### మాధ్యమిక పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్‌లు

ఐసిఎఫ్, జనవరి 11: రాష్ట్రవ్యాప్తంగా 6,992 మాధ్యమిక పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టిన విద్యాశాఖ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇదివరకే స్మార్ట్ బోర్డు సౌకర్యం కల్పించింది. త్వరలో మాధ్యమిక పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ల్యాబ్‌లకు సంబంధించిన కంప్యూటర్ ఆపరేటర్లను ఒప్పంద పద్ధతిలో నియమించనున్నామని అధికారులు తెలిపారు.

### పొంగల్ కానుకల ఫిర్యాదులకు ప్రత్యేక నెంబర్లు

పెరంబూర్, జనవరి 11: పొంగల్ కానుకలకు సంబంధించిన ఫిర్యాదులకు ఆహార శాఖ ప్రత్యేక నెంబర్లు పరిచయం చేసింది. సంక్రాంతి సందర్భంగా బియ్యం రేషన్ కార్డుదారులకు రూ.1,000 నగదు, ఒక కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, ఒక చెరుకు గడ అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో, టోకెన్లు లభించని కార్డుదారులు ఈనెల 14వ తేదీ రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర నమోదు చేసి పొంగల్ కానుక పొందవచ్చని ఆహార శాఖ తెలియజేసింది. అలాగే, కానుకల పంపిణీలో అవకతవకలు, సరుకుల్లో నాణ్యత లేకపోవడం తదితరాలకు సంబంధించి ప్రజలు '1967', '1800 425 5901' అనే నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

### ఎన్నూర్ చమురు తెట్టు వ్యవహారం

# ఇతర సంస్థలపై చేపట్టిన చర్యలేంటి?

● రాష్ట్రప్రభుత్వానికి గ్రీన్ ట్రిబ్యునల్ ప్రశ్న

పెరంబూర్, జనవరి 11: స్థానిక ఎన్నూర్‌లో వరద నీటిలో ముడిచమురు వ్యర్థాలు కలిసిన వ్యవహారంలో ఇతర సంస్థలపై తీసుకున్న చర్యలు ఏమిటని గ్రీన్ ట్రిబ్యునల్ ప్రశ్నించింది. తిరువొత్తియూర్ కర్మాగారం నుంచి వెలువడిన చమురు తెట్టు వరద నీటిలో కలసి సుమారు 30,000 వేలకు పైగా ఇళ్లలో చేరింది. తెట్టు పేరుకుపోవడంతో ప్రజలు నివసించలేని పరిస్థితులు నెలకొన్నాయి. తెట్టుకు బాధ్యులు ఎవరు అనే విషయం పరిశీలించేలా తమిళనాడు పర్యావరణ నియంత్రణ బోర్డు ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో, ఎన్నూర్ చమురు తెట్టు వ్యవహారంలో ఇతర సంస్థలపై తీసుకున్న చర్యలేంటని? ఆ విషయమై నివేదిక దాఖల చేయాలని రాష్ట్రప్రభుత్వానికి దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యులన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, 1,937 మంది ఉద్యోగులు, నవీన యంత్రాలతో చమురు తెట్టును పూర్తిగా తొలగించారని, అయినా మరో మూడు నెలలు ఆ ప్రాంతాలను పర్యవేక్షించనున్నట్లు గ్రీన్ ట్రిబ్యునల్‌కు కాలుష్య నియంత్రణ బోర్డు తెలియజేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 29వ తేదీకి ట్రిబ్యునల్ వాయిదావేసింది.



చెన్నై టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం గాత్ర కచేరి నిర్వహించిన ప్రియా సిస్టర్స్‌ను సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు రంగారెడ్డి, పీవీఆర్ కృష్ణారావు, మోహన్‌రావు తదితరులు

# ఫిబ్రవరి 16 నుంచి రైల్వే కార్మికుల సమ్మె

● ఎస్ఆర్ఎంయూ-ఏఐఆర్ఎఫ్ ప్రకటన




నిరాహారదీక్ష ముగింపు సభలో మాట్లాడుతున్న ఎస్ఆర్ఎంయూ నేత కన్నయ్య

ప్యారీస్, జనవరి 11: పాత పింఛన్ పథకాన్ని అమలుపరచాలని, ఖాళీ పోస్టుల భర్తీ చేయాలని, ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో ఫిబ్రవరి 16 నుంచి అన్ని రైల్వే కార్మిక సంఘాలతో కలసి సమ్మె చేపట్టనున్నట్లు సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్ఆర్ఎంయూ), ఏఐఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.కన్నయ్య ప్రకటించారు. రైల్వే కార్మికుల డిమాండ్లను పరిష్కరింయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 8 నుంచి 1వ తేదీ వరకు ఎస్ఆర్ఎంయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైల్వే డివిజన్లలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష ముగింపు సభ చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశంలో కన్నయ్య పాల్గొని మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా రైల్వే శాఖలో పనిచేస్తున్న కార్మికులకు, అటు ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న రైల్వే శాఖను ప్రైవేటీకరణ చేసే పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ తమ సంఘం పిలుపు మేరకు చేపట్టిన రిలే నిరాహారదీక్షలో వేలాది మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేశారన్నారు. దేశంలో 600 రైల్వేస్టేషన్లను రీ డెవలప్‌మెంట్ అనే పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రైల్వేతో పాటు బీపీసీఎల్, ఐఓసీ, హెచ్‌సీఎల్, ఓఎన్‌జీసీ, ఎల్ఐసీ తదితర సంస్థలను సైతం ప్రైవేటుపరం చేసే పనులను కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ఫిబ్రవరి 15లోపు పరిష్కరింపజేయకుంటే 16 నుంచి సమ్మె బాట పడతామని కన్నయ్య కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### కలైంజర్ ట్రస్టు ద్వారా రూ.2లక్షల సాయం

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయంలో ఏర్పాటైన కలైంజర్ ట్రస్టు ద్వారా వైద్యసాయం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.2లక్షలను సాయంగా అందించారు. కలైంజర్ కరుణానిధి ట్రస్టు ఆధ్వర్యంలో యేటా బలహీనవర్గాలకు చెందిన నిరుపేదలకు వైద్యసాయం కోసం ఆర్థిక సాయం అందించటం ఆనవాయితీ. ఇప్పటివరకూ ఆ ట్రస్టు ద్వారా రూ.5.91 కోట్ల మేరకు సాయం అందించారు. ఈ నేపథ్యంలో ఈ యేడాది సాయం కోరుతూ దరఖాస్తులు పంపిన 8 మందికి తలా రూ.25వేల చొప్పున మొత్తం రూ.2లక్షలను సాయంగా అందించారు. చెన్నై పెరియపనిచ్చేరికి చెందిన సేతుమాధవన్, ట్రిప్లికేన్‌కు చెందిన వేదా ఉదయసూర్యన్, తిరువారూరుకు చెందిన ఎం.కందసామి, తేనికి చెందిన జి. మునీశ్వరి, తిరుచ్చికి చెందిన ఎం.జీవా. మదురైకు చెందిన ఎస్.రాధాకృష్ణన్, తిరుప్పూరుకు చెందిన ఎస్.వీరముత్తు, కోయంబత్తూరుకు చెందిన వి.సంజయ్‌కి ఈ సాయం అందించినట్లు ఆ ట్రస్టు నిర్వాహకులు ఓ ప్రకటన వెలువరించారు.

### టాస్మాక్ ఉద్యోగుల ఆందోళన

ఐసిఎఫ్, జనవరి 11: శాసనసభ సమావేశాల సమయంలో ఆందోళన చేపట్టనున్నట్లు టాస్మాక్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పెరియస్వామి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మద్యం దుకాణాల్లో 25,000 మంది ఉద్యోగులు ఇరవై ఏళ్లకు పైగా పనిచేస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయాలని, వేతనం పెంచాలని, పింఛన్ వంటి ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

### నిష్క్రమించనున్న ఈశాన్య రుతుపవనాలు

ఐసిఎఫ్, జనవరి 11: రెండు రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు నిష్క్రమించనున్నాయని, రాబోయే రోజుల్లో రాత్రి, ఉదయం మంచు కురవడంతో పాటు పగటి పూట కొంచెం ఉక్కపోత ఉంటుందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో నాలుగు తుఫానులొచ్చాయి. ఈ నేపథ్యంలో నైరుతి రుతుపవనాలు ఒకటి, రెండు రోజుల్లో ముగియనున్నాయి. పగటి పూట మితమైన ఎండ, సాయంత్రం నుంచి వేకువజాము వరకు మంచు కురుస్తుందని వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే, తమిళనాడు, పుదుచ్చేరిలో అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు 44 సెం.మీ వర్షం కురవాల్సి ఉండగా, 4 శాతం అదనంగా 48 సెం.మీ కురిసిందని, చెన్నైలో 2022లో సగటున 92 సెం.మీ వర్షం కురవగా, 2023లో 109 సెం.మీ వర్షం కురిసిందని పేర్కొంది. రెండు రాష్ట్రాల్లో జనవరి 1 నుంచి 10వ తేదీ వరకు 5 సెం.మీ వర్షపాతం నమోదైందని, చెన్నైలో మాత్రమే 1 సెం.మీ వర్షం కురిసిందని వాతావరణ కేంద్రం తెలిపింది.

### లబ్ధిదారులకు సహాయాల పంపిణీ



లబ్ధిదారులకు సహాయాలు అందిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, జనవరి 11: స్థానిక కాట్పాడి డివిజన్‌లో బుధవారం సాయంత్రం దివంగత మాజీ ముఖ్య మంత్రి కరుణానిధి శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1,009 మందికి రూ.493 కోట్ల సంక్షేమ సహాయాలు, 'ప్రజలతో ముఖ్యమంత్రి' శిబిరంలో వినతిపత్రాలు అందజేసిన 410 మందికి రూ.16.48 లక్షల సంక్షేమ సహాయాలను రాష్ట్ర మంత్రి దురైమురుగన్ అందజేశారు. ఎమ్మెల్యేలు నందకుమార్, ఈశ్వరప్పన్, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, జిల్లా కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్, కార్పొరేషన్ కమిషనర్ సుజాత ఆనందకుమార్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, కార్పొరేషన్ కమిషనర్ జానకి, 3వ మండల కమిటీ అధ్యక్షుడు వన్నియరాజ, యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, ఉపాధ్యక్షుడు శరవణన్, రెవెన్యూ తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి సెంథిల్ బాలాజీకి 15వ సారి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జనవరి 11: మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను 15వ సారి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు బట్వాడా చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గత ఏడాది జూలై 14వ తేది మంత్రి సెంథిల్ బాలాజిని అరెస్ట్ చేసి పూళల్ జైలుకు తరలించారు. సెంథిల్ బాలాజి దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై తీర్పు ఈనెల 12వ తేది రానున్న నేపథ్యంలో, గురువారం ఆయన రిమాండ్ గడువు ముగిసింది. దీంతో, ఆయనను జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరచగా, ఈ నెల 22వ తేది వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీ చేశారు.

### రూ.2.55 కోట్లతో కమ్యూనిటీ హాలు

ఐసిఎఫ్, జనవరి 11: స్థానిక అన్నానగర్ మండలం 94వ వార్డు సిడ్కో నగర్‌లో రూ.2.55 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ హాలు భవన నిర్మాణం త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. సిడ్కో నగర్ 4వ మెయిన్ రోడ్డులో 12 ఏళ్ల క్రితం కార్పొరేషన్ నిర్మించిన కమ్యూనిటీ హాలు శిథిలావస్థలకు చేరుకోవడంతో ఆ భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించేందుకు అధికారులు నిర్ణయించారు. టెండర్లు ఆహ్వానించి సంక్రాంతి అనంతరం నిర్మాణపనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

### నేడు ఢిల్లీలో డీఎంకే విద్యార్థి విభాగ నిరసన ర్యాలీ

ప్యారీస్, జనవరి 11: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంకే విద్యార్థి విభాగ కార్యదర్శి, ఎమ్మెల్యే ఎళిలరసన్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం 2020 వల్ల విద్యారంగం కాషాయమయమైందని, దీన్ని వ్యతిరేకిస్తూ 16 విద్యార్థి సంఘాలతో కలసి, 'విద్యారంగాన్ని కాపాడుకుందాం, జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం' అనే నినాదంతో ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

### ఇరుముడితో దర్శనానికి ఆహ్వానం

ఐసిఎఫ్, జనవరి 11: శబరిమలకు వెళ్లలేని భక్తులు ఇరుముడితో స్వామివారిని దర్శించేందుకు ఆలయానికి రావొచ్చని మడిపాక్కంలో ఉన్న అయ్యప్ప ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది శబరిమలలో భక్తుల రద్దీ పెరగడంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు అయ్యప్పను దర్శించుకోలేని పరిస్థితులు తలెత్తాయి. అక్కడ దర్శనం చేసుకోలేని వారు, శబరిమలకు వెళ్లని వారు మడిపాక్కంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో 18 పడికట్లు ఎక్కి స్వామిని దర్శించుకోవచ్చని నిర్వాహకులు ప్రకటించారు. అలాగే, నెయ్యి అభిషేకం కూడా చేయవచ్చన్నారు. ఈనెల 22వ తేది ఉదయం 9 గంటల నుంచి ఆలయంలో అఖండ రామ జపం జరుగుతుందని తెలిపారు.

### పంచాయతీలను నగరాల్లో విలీనం చేయొద్దు

● ఈపీఎస్ డిమాండ్



చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీలను నగరాల్లో విలీనం చేసే చర్యలు చేపట్టకూడదంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన జారీ చేస్తూ... పంచాయతీలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధుల కాలం ఈ యేడాదితో ముగియనుడటంతో ఆ పంచాయతీలను సమీపంలో ఉన్న నగర పంచాయతీలు, లేదా నగర మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేసే విషయంగా అధికారులు ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకర జరుపుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. సాధారణంగా ప్రతి పంచాయతీకి అక్కడి జనాభా ప్రాతిపదికగా కేంద్రప్రభుత్వం వివిధ పథకాల అమలుకు నిధులు కేటాయిస్తుందన్నారు.. ప్రస్తుతం కేంద్రం ఆ నిధులను బాగా తగ్గించిందన్నారు. దీంతో పంచాయతీలను నగర పంచాయతీలు, మునిసిపాలిటీలలో విలీనం చేయాలని డీఎంకే ప్రభుత్వం నిర్ణయించిందని, ఎట్టి పరిస్థితులలోనూ ఇతర స్థానిక సంస్థలతో విలీనం చేయకూడదని కోరారు. అవసరమయితే రాష్ట్ర ప్రభుత్వమే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి ఆదుకోవాలని ఈపీఎస్ విజ్ఞప్తి చేశారు.

### వేలూరు డీఐజీగా సరోజ్‌కుమార్ ఠాగూర్



వేలూరు, జనవరి 11: వేలూరు డివిజన్ డీఐజీగా ఉన్న ముత్తుస్వామి పదోన్నతిపై చెన్నై అడిషినల్ డీఐజీగా వెళ్లారు. ఆయన స్థానంలో కృష్ణగిరి ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్ నియమితులయ్యారు. ఆయన గురువారం డీఐజీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు.

### అంకిత్ తివారి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జనవరి 11: ప్రభుత్వ వైద్యుడి వద్ద లంచం తీసుకున్న కేసులో ఈడీ అధికారి అంకిత్ తివారి రిమాండ్‌ను ఈ నెల 24వ తేది వరకు దిండుగల్ క్రిమినల్ కోర్టు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దిండుగల్ ప్రభుత్వ వైద్యుడి వద్ద రూ.20 లక్షలు లంచం తీసుకున్న ఈడీ అధికారి అంకిత్ తివారిని గత నెల 1వ తేది అవినీతి నిరోధక శాఖ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

### ఆదియోగిని దర్శించుకున్న 80 లక్షల మంది

పెరంబూర్, జనవరి 11: కోయంబత్తూర్‌లోని ఈషా యోగా కేంద్రంలో ఉన్న ఆదియోగి విగ్రహాన్ని గత ఏడాది 80 లక్షల మంది సందర్శించారు. అలాగే, నూతన సంవత్సరం రోజైన ఈనెల 1వ తేది మాత్రమే 1.26 లక్షల మంది సందర్శించినట్లు కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

### 100 ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

ప్యారీస్, జనవరి 11: రాష్ట్రప్రభుత్వ రవాణా శాఖ ఎయిర్ కండిషన్ వసతితో 100 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది. నగరంలో పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా ప్రయాణికులకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించిన బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం పరిశీలిస్తోందని గత అసెంబ్లీ సమావేశాల్లో రవాణా శాఖ మంత్రి శివశంకర్ ప్రకటించారు. ఆ మేరకు ఎలక్ట్రికల్ ఏసీ బస్సుల కొనుగోలు, ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు, డిపోల అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్‌లో పాల్గొనదలచిన సంస్థలు తగిన దస్తావేజులతో ఆన్‌లైన్‌లో గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది.

### సీపీఐ ఎంపీ సెల్వరాజ్ ఆసుపత్రిలో చేరిక

ప్యారీస్, జనవరి 11: నాగపట్టినం పార్లమెంటు సభ్యుడు, సీపీఐ రాష్ట్ర నిర్వాహక కమిటీ సభ్యుడు సెల్వరాజ్(67) శ్వాసకోశ సమస్యల కారణంగా తిరువారూర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తిరువారూర్ జిల్లా ముత్తుపేట సమీపంలోని సిత్తమల్లికి చెందిన ఆయనకు గతంలో బైపాస్ సర్జరీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన బుధవారం శ్వాస తీసుకోనేందుకు ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను తిరువారూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### తిరుచెందూర్ ఆలయ హుండీ ఆదాయం రూ.2.70 కోట్లు

ఐసిఎఫ్, జనవరి 11: తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2.70 కోట్లని అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానంతరం భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు ప్రతినెలా లెక్కిస్తుంటారు. డిసెంబరులో సమర్పించిన కానుకలను లెక్కింపు ప్రక్రియ గత రెండు రోజులుగా జరిగింది. మొత్తం రూ.2,70,70,541 నగదు, 1.1 కిలోల బంగారు ఆభరణాలు, 29.3 కిలోల వెండి వస్తువులు, 417 విదేశీ కరెన్సీ నోట్లు భక్తులు కానుకలుగా సమర్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

### 120 ఏళ్లనాటి చింత చెట్టుకు పునరుజ్జీవనం



ఐసిఎఫ్, జనవరి 11: స్థానిక ఎగ్మూర్ మ్యూజియంలో ఉన్న 120 ఏళ్ల నాటి చింత చెట్టుకు పునరుజ్జీవనం కల్పించారు. మ్యూజియం ప్రాంగణంలో ఉన్న భారీ చింత వృక్షం ఈనెల 2వ తేది కూలింది. వేళ్లతో ఆ చెట్టును అదే స్థలంలో నాటేందుకు నిర్ణయించిన అధికారులు, 8వ తేది కొమ్మలు తొలగించి, రసాయనాలు పూసి, యంత్రం సాయంతో అదే స్థలంలో మళ్లీ నాటారు.

### ఈఎస్ఐసీ ఆసుపత్రికి మృతదేహం దానం

ఐసిఎఫ్, జనవరి 11: ఈఎస్ఐసీ ఆసుపత్రికి ఓ కుటుంబం మృతదేహాన్ని దానం చేసింది. కేకేనగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఆసుపత్రి పోస్టుమార్టం విభాగంలో భౌతికదేహాల దాన విభాగం ప్రారంభించేందుకు తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం అనుమతి ఇచ్చింది. ఈ స్వచ్ఛంద దాన విభాగంలో మంగళవారం భౌతికదేహం దానం చేసేందుకు ఓ కుటుంబం ముందుకొచ్చింది. వారిని వైద్యులు అభినందించారు.

### రోడ్లపై పశువులను వదిలితే రూ.5 వేలు జరిమానా

ఐసిఎఫ్, జనవరి 11: రోడ్లపై పశువులను వదిలే సంరక్షకులకు ఇకపై రూ.5 వేలు జరిమానా విధించనున్నట్లు చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ హెచ్చరించారు. స్థానిక ఆలందూర్ మండలం నంగనల్లూర్‌లో మంగళవారం ఎద్దు పొడిచి మాజీ తపాలా అధికారి చంద్రశేఖర్ మృతి చెందారు. దీంతో, ఆ ప్రాంతంలో బుధవారం కార్పొరేషన్ సిబ్బంది రోడ్లపై సంచరించే పశువులను బంధించి వాటిని సంరక్షించేవారికి జరిమానా విధించారు. ఈ విషయమై కమిషనర్ రాధాకృష్ణన్ విలేకరులతో మాట్లాడుతూ... రోడ్లపై సంచరించే పశువుల యజమానులకు ఇదివరకు రూ.2 వేలు జరిమానా విధిస్తుండగా, ఇకపై రూ.5 వేలు వసూలు చేస్తామన్నారు. మళ్లీ అదే పశువు పట్టుబడితే జరిమానా రూ.10 వేలుగా ఉంటుందని, మూడోసారి పట్టుబడితే రోజుకు రూ.1,000 చొప్పున అదనంగా వసూలు చేస్తామని హెచ్చరించారు.

### 31వ తేదీకి మాజీ మంత్రి విజయభాస్కర్‌పై కేసు వాయిదా

పెరంబూర్, జనవరి 11: అన్నాడీఎంకే మాజీ మంత్రి విజయభాస్కర్‌పై నమోదైన ఆస్తుల కేసుల విచారణ ఈనెల 31వ తేదీకి వాయిదాపడింది. పుదుకోట జిల్లా విరాలిమలై అన్నాడీఎంకే ఎమ్మెల్యే సి.విజయభాస్కర్, అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన సమయంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని అవినీతి నిరోధక, పర్యవేక్షణ విభాగం పోలీసులు విజయభాస్కర్, ఆయన భార్యపై కేసు నమోదు చేశారు. ఈ కేసు పుదుకోట జిల్లా ప్రిన్సిపల్ న్యాయస్థానం విచారిస్తుండగా, ఇప్పటికే ఈ కేసులో చార్జీషీటు, 17,000 పేజీలతో కూడిన ఆస్తుల దస్తావేజుల నకళ్లు న్యాయస్థానంలో దాఖలు చేశారు. ఈ నకళ్లను విజయభాస్కర్ కూడా కోర్టు ఉత్తర్వులతో అధికారులు అందజేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణ గురువారం జరగ్గా, తదుపరి విచారణ ఈ నెల 31వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి కె.పూర్ణ జయ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఎంవీఐ ఇంట్లో ఏసీబీ తనిఖీలు

● రూ.6.5 లక్షల నగదు స్వాధీనం



వసంతి

వేలూరు, జనవరి 11: తమిళనాడు - ఆంధ్ర సరిహద్దు ప్రాంతం క్రిస్టియన్‌పేటలో ఉన్న చెక్‌పోస్ట్‌లో మోటరు వాహన చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వసంతి (50) వాహన చోదకుల నుంచి లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, అవినీతి నిరోధక శాఖ పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులతో కలసి చెక్‌పోస్ట్ వద్దకు వెళ్లగా, వారిని గమనించి వసంతి కారులో వెళ్లిపోయారు. అధికారులు కూడా వాహనాల్లో ఆమెను వెంటాడి సిప్కాట్ భారతినగర్‌లో కారును అడ్డుకొని తనఖీ చేపట్టారు. కారులో రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భారతినగర్‌లోని వసంతి ఇంట్లో ఏసీబీ డీఎస్పీ శంకర్, ఇన్‌స్పెక్టర్ విజయ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టి, లెక్కల్లో చూపని రూ.3.25 లక్షలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన అధికారులు ఆమెను విచారిస్తున్నారు.



తిరుప్పూరులో స్వాతంత్ర్య సమరయోధుడు తిరుప్పూరు కుమారన్ 92 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న రాజకీయ నేతలు



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న సింగపూరు హోం, న్యాయశాఖ మంత్రి కే షణ్ముగం, ఆ దేశ రాయబారి ఎడ్గర్ పెంగ్

## గేమ్ అంటేనే గొడవ

● వనిత విజయకుమార్



బిగ్‌బాస్ మాత్రమే కాదు, ఏ ఆట తీసుకున్నప్పటికీ అందులో పోటీతత్వం, గొడవలు సహజమని ప్రముఖ వివాదాస్పద నటి వనితా విజయకుమార్ అన్నారు. ఆమె ఓ పాత్రను నటించిన 'ఈ మెయిల్' చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుక ఇటీవల చెన్నైలో జరిగింది. ఇందులో ఆమె పాల్గొని ప్రసంగిస్తూ, 'ఈ మెయిల్' టైటిల్ ఆకట్టుకునేలా ఉంది. ఇది ఒక ఆన్‌లైన్ గేం నేపథ్యంగా తెరకెక్కించారు. సాధారణంగా ఆట అంటేనే గొడవలు. అది బిగ్‌బాస్ కావొచ్చు మరొకటి కావొచ్చు. ఇలాంటి క్రీడల్లో లీనమైతే, మన మనస్సులను నియంత్రణలో ఉంచుకోవాలి. అయితే, నేటి యువతలో ఆ నియంత్రణ కరువైంది. అందుకే క్రీడలు ఆడే సమయంలో చిన్నపాటి విషయానికే నిగ్రహం కోల్పోతున్నారు. చిన్నారుల చేతికి మొబైల్ ఫోన్స్ ఇస్తున్నారు. వారికి మనకంటే అన్ని విషయాలు బాగా తెలుసు. పిల్లలకు ఏది ఎంతవరకు చెప్పాలో అంతవరకే చెప్పాలి. ఏ విషయంలో వారి మనసులను లగ్నం చేయాలో పెద్దవారే గుర్తించి ఆ దిశగా దృష్టిసారించాలి' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

## విజయ్ న్యూ గెటప్


● ఫ్యాన్స్‌తో సెల్ఫీ



అగ్ర హీరో విజయ్ కొత్త గెటప్‌లో కనిపించి తన అభిమానులను ఆశ్చర్యపరిచారు. అంతేకాకుండా కొత్త గెటప్‌లో వారితో సెల్ఫీ తీసుకున్నారు. దీంతో ఆయన అభిమానులు తెగ సంబరబడి పోయారు. 'లియో' తర్వాత విజయ్ ప్రస్తుతం వెంకట్ ప్రభు చిత్రంలో నటిస్తున్నారు. 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం' టైటిల్‌ను ఖరారు చేశారు. వర్కింగ్ టైటిల్‌గా 'గోట్' అని పెట్టారు. ఇందులో జయరాం, ప్రభుదేవా, మోహన్, ప్రశాంత్, వైభవ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు నటిస్తున్నారు. యువన్‌శంకర్ రాజా సంగీతం. ఏజీఎస్ బ్యానరుపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతోంది. షూటింగ్ సమయంలో లొకేషన్‌కు వచ్చిన అభిమానులను విజయ్ కలుసుకున్నారు. వారితో సెల్ఫీ దిగారు. పైగా ఆయన మీసాలు లేకుండా కొత్త గెటప్‌లో కనిపించడంతో ఆశ్చర్యపోయారు. ఆ ఫొటోను చిత్ర బృందం సోషల్ మీడియాలో విడుదల చేసింది.

## ఒత్తిడిని మాటలతో తగ్గించారు

● మాళవిక మోహనన్



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'పేట' చిత్రం ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన మలయాళ భామ మాళవిక మోహనన్. ఈ సినిమాలో తొలి షాట్ రజనీకాంత్‌తో నటించానని, అపుడు తనలో ఉన్న ఒత్తిడిని మాటలతో రజనీ తగ్గించారని ఆమె పేర్కొన్నారు. ఈ సినిమా విడుదలై ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మాళవిక మోహనన్ స్పందిస్తూ... 'పేట' చిత్రంలో నటించడానికి ఏకైక కారణం రజనీకాంత్. చిన్నప్పటి నుంచి ఆయన్ను చూస్తూ పెరిగా. అందుకే ఈ సినిమాలో వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకున్నా. అయితే, తొలి షాట్ రజనీతో తీసేలా దర్శకుడు సన్నాహాలు చేశారు. ఆ సమయంలో నేను పడుతున్న టెన్షన్‌ను గుర్తించిన రజనీకాంత్.. తన దగ్గర కూర్చోబెట్టుకుని, నా వివరాలతో పాటు కుటుంబ వివరాలను అడుగుతూ ఆ ఒత్తిడిని తగ్గించారు. నిజానికి ఈ సినిమాలో ఆయనకు నేను హీరోయిన్‌ను కాదు. అయినప్పటికీ ఆయన నాకు ఎంతగానో సహకరించారు. ఆయనతో కలిసి పని చేసిన మధుర క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను' అని మాళవిక మోహనన్ పేర్కొన్నారు.

## హీరో సూర్య సరసన అదితి శంకర్?



తమిళ చిత్రపరిశ్రమకు చెందిన స్టార్ డైరెక్టర్ ఎస్.శంకర్ కుమార్తె అదితి శంకర్‌కు హీరోయిన్‌గా మరో బిగ్ ఆఫర్ వచ్చినట్టు వార్తలు వస్తున్నాయి. హీరో సూర్య సరసన నటించే అవకాశాన్ని ఆమె దక్కించుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. సూర్య ప్రస్తుతం చిరుత్తై శివ దర్శకత్వంలో 'కంగువా'లో నటిస్తున్నారు. ఆ తర్వాత ఆయన తన 43వ సినిమాను సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కించనున్నారు. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం. ఇందులో దుల్కర్ సల్మాన్, నజ్రియా ఫాజిల్, విజయ్ వర్మ ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్ బ్యానరుపై నిర్మించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా అదితి శంకర్‌ను ఎంపిక చేసినట్టు సమాచారం. అయితే, ఈ ప్రచారంపై చిత్రబృందం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.



సంక్రాంతి వేడుకల్లో భాగంగా, హీరో కార్తీకి చెందిన 'ఉళవర్ ఫౌండేషన్ ఉళవర్ అవార్డులు-2024' ప్రదానం చెన్నైలో జరగ్గా, అవార్డును స్వీకరిస్తున్న ఓ గ్రామీణ ఔత్సాహిక మహిళా వ్యాపారి.



సామూహిక అర్చనలో పాల్గొన్న భక్తులు





అశోక్‌నగర్ ఆలయంలో బారులు తీరిన భక్తులు - ఆళ్వార్‌పేట ఆలయంలో సర్వాలంకరణ శోభితులైన దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి

## నామక్కల్, నంగనల్లూరు ఆలయాల్లో
# వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



అశోక్‌నగర్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నామక్కల్, నంగనల్లూరు, ఆళ్వార్‌పేట ఆలయాలు సహా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నామక్కల్ కోట ప్రాంతంలో 18 అడుగుల ఎత్తు ఏకశిలా ఆంజనేయస్వామివారి విగ్రహం ఉన్న ఆలయంలో ఈ వేడుకలు భారీ ఏర్పాట్ల నడుమ నిర్వహించారు. ఆంజేయస్వామివారు ప్రశాంత స్వరూపుడిగా దర్శనమిచ్చే ఈ ఆలయంలో యేటా తమిళ మార్గశిర మాసం అమావాస్యనాడు హనుమజ్జయంతి వేడుకలు జరపటం ఆనవాయితీ. ఆ మేరకు గురువారం ఉదయం ఆలయంలోని స్వామివారి విగ్రహాన్ని లక్షా ఎనిమిది వడలతో తయారైన మాలలతో అలంకరించారు. ఇరవై మందికిపైగా భట్టాచార్యులు ఈ వడమాలల తయారీ అలంకరణ పనులు చేపట్టారు. వేకువజాము ఐదగంటలకు ఈ వడమాలలను స్వామివారికి ధరింపజేశారు. ఆ తర్వాత మహాదీపారాధన, హారతి నైవేద్యం సమర్పించారు. అటు పిమ్మట ఉదయం 11 గంటలకు వడమాలలను తొలగించి, 1009 లీటర్ల పాలు, పెరుగు, పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి స్వర్ణకవచం ధరింపజేశారు. ఆ తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించి మధ్యాహ్నం 1గంటకు మహా దీపారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ నల్లుసామి, ట్రస్టీలు డాక్టర్ మల్లికా శీనివాసన్, సెల్వశిరాళన్, రమేష్‌బాబు, ఆలయ సహాయ కమిషనర్ ఇళయరాజా, ఉభయదారులు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ రాజేష్‌కన్నన్ నేతృత్వంలో సుమారు 500 మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

**చెన్నైలో... :** ఇదిలా ఉండగా నగరంలోని ఆళ్వార్‌పేట, నంగనల్లూరు, అశోక్‌నగర్, ఆళ్వార్‌పేటలోని ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. ఆళ్వార్‌పేట ఆలయంలో గురువారం వేకువజామునే మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పూల మాలలతో అలంకరించారు. వేడుకుజాము నుండే భక్తులు ఈ ఆలయం వద్ద బారులు తీరారు. భక్తులంతా స్వామివారికి తులసిమాలలను సమర్పించారు.





నంగనల్లూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలలో సతీసమేతంగా పాల్గొన్న గవర్నర్ ఆర్ఎన్ రవి - నామక్కల్ ఆలయంలో వడమాల ధరించి దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి

**అశోక్‌నగర్‌లో... :** అశోక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ వేడుకలు పది రోజుల ఉత్సవంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజైన మంగళవారం మూలవిరాట్టును 15,800 వడలతో తయారు చేసిన మాలలతో అలంకరించారు. బుధవారం 10001 లడ్డూలను మాలలుగా తయారు చేసి స్వామివారిని అలంకరించారు. గురువారం ఉదయం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు జరిపారు. వేకువజాము 4.30 గంటలకే ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతించారు. మూలవిరాట్టుకు వెండి కవచాన్ని దరింపజేశారు.

**నంగనల్లూరులో... :** నంగనల్లూరులోని ఆంజనేయస్వామి ఆలయంలోనూ హనుమజ్జయంతి వేడుకలు కనులపండువగా జరిగాయి. ఈ వేడుకలలో గవర్నర్ ఆర్ఎన్ రవి సతీసమేతంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచ శాంతిని కోరుతూ స్వామివారిని ప్రార్థించినట్లు గవర్నర్ తెలిపారు. ఉదయం 8గంటలకు ఆలయంలోని మూలవిరాట్టుకు విశేష పూజలు నిర్వహించారు. మళ్లీ ఉదయం 11 గంటలకు విశేష పూజలు జరిపారు. ఉదయం ఆరుగంటల నుండే స్వామివారిని దర్శించేందుకు వేల సంఖ్యలో భక్తులు ఈ ఆలయం వద్ద క్యూలో బారులు తీరారు.

## హైకోర్టు తీర్పుతో అన్నాడీఎంకే శ్రేణుల సంబరాలు



ప్రజలకు మిఠాయిలు పంచుతున్న డాక్టర్ సునీల్

పెరంబూర్, జనవరి 11: మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం అప్పీలు పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో, అన్నాడీఎంకే శ్రేణులు గురువారం సంబరాలు జరుపుకున్నాయి. పార్టీ నుంచి బహిష్కరింపబడిన పన్నీర్‌సెల్వం... అన్నాడీఎంకే జెండా, చిహ్నం, లెటర్ పాడ్ వినియోగించడాన్ని నిషేధిస్తూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఓపీఎస్ దాఖలుచేసిన అప్పీలు పిటిషన్‌ను ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చుతూ, సింగిల్ జడ్జి ఉత్తర్వులు చెల్లుతాయని ప్రకటించింది. హైకోర్టు తీర్పుతో అన్నాడీఎంకే శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా టపాసులు కాలుస్తూ, మిఠాయిలు పంచుకున్నాయి. స్థానిక టి.నగర్ ప్రాంతంలో పార్టీ ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ నేతృత్వంలో కార్యకర్తలు టపాసులు కాల్చి, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ... కోటిన్నర మంది కార్యకర్తలతో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో రాబోయే పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే భారీ విజయాలు నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంబరాల్లో పార్టీ నాయకులు కె.సూర్యకళ, కె.కనిమొళి, ఎస్.సురేష్‌కుమార్, కరాటే ఎస్.శేఖర్, గార్డన్ వి.సురేష్‌కుమార్, కాలనీ సి.ప్రభాకరన్, ఎస్.సతీష్‌కుమార్, ఎం.లోకనాథన్, టి.సుడలైముత్తు, వి.జయశంకర్, ఎస్.అరుళ్‌మురుగన్, కె.మాసిలామణి, మాంబళం గురుప్రసాద్, ఆర్.రాజేష్‌కుమార్, రాయల్ వెంకటేష్, మాంబళం రాణి సహా పెద్దసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

### ఘనంగా మంగుణి అమావాస్య ప్రత్యేక పూజలు



అన్నదానం నిర్వహిస్తున్న వాసవి క్లబ్స్ షావుకారుపేట చెన్నై నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 11: పుష్య మాసంలో గురువారం వచ్చిన మౌని అమావాస్యను చాలా పవిత్రమైన పర్వదినంగా భావించి వాసవి క్లబ్స్ షావుకారుపేట చెన్నై ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జార్జిటౌన్‌లోని ఆదియప్ప వీధిలో సుమారు 300 మందికి పైగా పేదలకు వాసవి క్లబ్‌ల వి-502ఏ జిల్లా గవర్నర్ రష్మి ఓలేటి, చైర్‌పర్సన్ ముంజులూరు మురళీ మోహన్, రెండు క్లబ్‌ల అధ్యక్షులు చీమకుర్తి మల్లికార్జునరావు-నాగలక్ష్మి, కార్యదర్శులు త్రిలోక్‌బాబు-పూర్ణిమ, ట్రెజరర్లు కె.ప్రవీణ్‌కుమార్-శివరంజని దంపతులు అన్నదానం చేశారు. ముందుగా కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

### కాకలూరు రామాలయంలో ప్రత్యేక పూజలు

ప్యారీస్, జనవరి 11: తిరువళ్లూర్ కాకలూరు సమీపంలోని మారుతి న్యూ టౌన్‌లో ఉన్న సెల్వగణపతి రామాలయంలో హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సన్నిధిలో కొలువైన రామభక్తాగ్రేసరుడైన హనుమంతుడికి 16 రకాల అభిషేకాలు, వెన్నతో అలంకార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సిందూరం సమర్పించి సీతారాములను పూజించి అక్షతలు, నూతన వస్త్రాలు, పండ్లు సమర్పించి ధూపదీపాలతో హారతులిచ్చారు. ఆలయ నిర్మాణకర్త శ్రీమన్నారాయణ ఊరా దంపతులు, ఆలయ సిబ్బంది, భజన కీర్తనలు ఆలపించి సేవలో పాల్గొన్న తిరువూర్ భాస్కర్ బృందం సభ్యులకు సంక్రాంతి సందర్భంగా దుప్పట్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆలయ సిబ్బంది, పూజారులు, కళాకారులకు పొంగల్ సందర్భంగా దుప్పట్ల పంపిణీ

● గవర్నర్‌కు వ్యతిరేకంగా

### పెరియార్ వర్శిటీ వద్ద నల్లజెండాల ప్రదర్శన

- 300మంది అరెస్టు -



పెరియార్ వర్శిటీ ఎదుట ధర్నా చేస్తున్న డీఎంకే విద్యార్థి విభాగం కార్యకర్తలు

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి వ్యతిరేకంగా అధ్యాపకులు సహా 14 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నల్లజెండాలను ప్రదర్శించారు. గురువారం మధ్యాహ్నం ఆ విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, అధికారులతో సమావేశమయ్యేందుకు గవర్నర్ చెన్నై నుంచి విమానంలో బయలుదేరి వెళ్లారు. అవినీతి ఆరోపణలకు గురై అరెస్టయి బెయిలుపై విడుదలైన ఆ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ జగన్నాథన్‌ను గవర్నర్ కలుసుకోవడాన్ని నిరసిస్తూ డీఎంకే విద్యార్థి విభాగం,కాలేజీ టీచర్ల సం ఘం, ద్రావిడ విద్యార్థి సంఘం తదితర 14 సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు సుమారు 300 మంది నల్ల జెండాలతో ధర్నా నిర్వహించారు. గవర్నర్ ఆ విశ్వవిద్యాలయం చేరుకోక మునుపు జరిగిన ఆందోళన వల్ల ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఆ తర్వాత పోలీసులు జోక్యం చేసుకు ని అందరినీ అరెస్టు చేశారు.అటుపిమ్మట పో లీసుల భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ గవర్న ర్ రవి ఆ విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు.



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని తుఫాను బాధితుల సహాయార్థం రూ.5లక్షల విరాళాన్ని అందజేస్తున్న పేరూరు ఆధీనం, శిరవై ఆధీనం, మయిలం ఆధీనం సుందరలింగ అడిగళార్, కుమారగురుపర స్వాములు, శివజ్ఞానత బాలాయ స్వామి



ప్రచారాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రశాంత్ కృష్ణ

### ప్రశాంత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన ప్రచారం

అడయార్, జనవరి 11: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన ప్రశాంత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు రోడ్డు సేఫ్టీ అవేర్‌నెస్ (రోడ్డు భద్రతా అవగాహన) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బుధవారం ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా 5 కిలోమీటర్ల వాక్‌థాన్‌ను నిర్వహించగా, ఇందులో 200 మందికిపైగా నగరవాసులు పాల్గొన్నారు. 'రహదారి భద్రతపై అవగాహన ప్రచారం' కోసం ఒక టోన్‌ను క్రియేట్ చేసింది. మూడు రోజుల పాటు జరిగే ఈ అవగాహన కార్యక్రమంలో నగరంలోని ప్రధాన ట్రాఫిక్ కూడళ్ల వద్ద సృజనాత్మక బ్యానర్లు, ప్లకార్డులను వలంటీర్లు ప్రదర్శించి, వాహనదారుల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంపై ప్రశాంత్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్‌కృష్ణ మాట్లాడుతూ... రోడ్డు భద్రతను నొక్కి చెప్పడమే ఈ ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

### రాంకో సిమెంట్స్ ఆధ్వర్యంలో 'కల్వి' ఆర్ట్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న నిర్వాహకులు

అడయార్, జనవరి 11: రాంకో సిమెంట్స్ కంపెనీ ఆధ్వర్యంలో 'కల్వి 40 చిల్డ్రన్స్ ఆర్ట్ ఎగ్జిబిషన్' విరుదునగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగింది. ఆది ద్రావిడ సంక్షేమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేలా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విరుదునగర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వీపీ జయశీలన్, ఆది ద్రావిడ వెల్ఫేర్ అధికారి జె.మణికంఠన్, రాంకో సిమెంట్స్ ఈవీపీ ప్రేమ్‌కుమార్, బంబుల్ బి ట్రస్ట్ కల్వి 10 ఫౌండర్ మదురై ద్రాడా సెల్వం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఇందులో ఇంగ్లిష్ లెర్నింగ్ స్కిల్స్, కల్వి 40 డిజిటల్ ట్రైనింగ్, టీచర్స్ మోటివేషన్ ట్రైనింగ్, కంప్యూటర్ ట్రైనింగ్ ఇలా అనేక కార్యక్రమాలను నిర్వహించారు.

### రాప్టీ ఎనర్జీ నుంచి హైఓల్టేజ్ ఈ-మోటర్ సైకిల్



హైఓల్టేజ్ ఈ-మోటర్ సైకిల్

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాల స్టార్టప్ కంపెనీ రాప్టీ తన హై ఓల్టేజీ ఈ- మోటర్ సైకిల్‌ను ఈ యేడాది ఏప్రిల్‌లో మార్కెట్లోకి ప్రవేశపెట్టనుంది. ఆ కంపెనీ తయారు చేసిన ఈ-మోటరు సైకిల్‌ను ఇటీవల ట్రేడ్ సెంటర్‌లో ప్రభుత్వ ఆద్వర్యంలో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా ప్రత్యేక స్టాల్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఈ వాహనాన్ని దేశవిదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు ప్రశంసించినట్లు రాప్టీ ఎనర్జీ సీఈఓ దినేష్ అర్జున్ తెలిపారు. ఇప్పటికే తమ సంస్థ చెన్నై శివార్లలోని నాలుగు ఎకరాల్లో రూ.85 కోట్ల తో ఫ్యాక్టరీని నెలకొల్పిందని ఆ సంస్థ సీటీఓ జయప్రదీప్ వాసుదేవన్ తెలిపారు. ఈ కొత్త ఎలక్ట్రిక్ మోటర్ సైకిల్ ఒక సారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని సీఈవో తెలిపారు.

## శ్రీ రామచంద్ర దంత కాలేజీకి అమెరికా నిధులు

అడయార్, జనవరి 11: స్థానిక పోరూరులోని శ్రీ రామచంద్ర దంత కాలేజీ (ఎస్ఆర్‌డీసీ)కి అమెరికాకు చెందిన యూఎస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) రూ.7.8 కోట్ల ఆర్థిక సాయం చేయనుంది. చిన్నారులకు వచ్చే పాల దంతాల్లో ఏర్పడే సమస్యల పరిష్కారం కోసం ఇంటెరాక్టివ్ మొబైల్ యాప్ ఆవిష్కరణ నిమిత్తం ఈ నిధులను అందజేయనుంది. ఈ యాప్ శిసువు వయసు, పెరుగుదలకు అనుగుణంగా ప్రేరణాత్మక హెచ్చరికలు చేస్తుంది. ఈ ప్రాజెక్టుకు పీడియాట్రిక్, ప్రివెంటివ్ డెంటిస్ట్రీ అధిపతి డాక్టర్ ఎంఎస్ ముత్తు నేతృత్వం వహిస్తారు. హ్యాపీయెస్ట్ మైండ్ టెక్నాలజీతో కలిసి ఈ యాప్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ యాప్ మొదటి వెర్షన్‌ను పరిమిత సమూహాలలో ట్రయల్ కోసం వచ్చే యేడాది నవంబరు నాటికి అందుబాటులోకి తెస్తారు. ఇందుకోసం శ్రీ రామచంద్ర ఆస్పత్రిలో పీడియాట్రిక్స్ విభాగంలో చికిత్స పొందుతున్న 540 మంది శిశులు, వారి తల్లిదండ్రులను వైద్యుల సూచన మేరకు ఎంపిక చేస్తారని ఎస్ఆర్‌డీసీ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

## కోయంబేడు మార్కెట్లో ప్రత్యేక సంత ప్రారంభం

పెరంబూర్, జనవరి 11: స్థానిక కోయంబేడు మార్కెట్లో సంక్రాంతి ప్రత్యేక సంత గురువారం ప్రారంభమైంది. యేటా సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ మార్కెట్లో పండగ సామగ్రితో ప్రత్యేక సంత 9 రోజులు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది సంతను మార్కెట్ వెనుక వైపున్న పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేశారు. ఈ సంతలో చెరకు గడలు, పసుపు, అల్లం తదితరాలు మాత్రమే హోల్‌సేల్‌గా విక్రయించేందుకు అనుమతించారు. ఇక పండుగకు అవసరమైన కూరగాయలు, పండ్లు, పూలు, మట్టి కుండలు, అరటి మొక్కలు, మామిడి, అరటి తోరణాలు, గుమ్మడికాయలు, కొబ్బరి తదితరాలు విక్రయానికి ఉంచారు.



పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు